క్లుప్తంగా

నేడు పెడనలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

పెడన: పెడన నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు పెడన పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న వాసవి ప్రార్థనా మందిరంలో ఈ సమావేశం ఉంటుందన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే అంశంపై జరిగే ఈ సమావేశంలో పార్టీ పెద్దలు మాట్లాడతారని తెలిపారు. పెడన నియోజకవర్గంలోని స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

మైనార్టీ నాయకుడు అబ్దుల్ బాబుల్‌కు సింహాద్రి పరామర్శ

చల్లపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని, మైనార్టీ సెల్ నాయకుడు అబ్దుల్ బాబుల్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం పరామర్శించారు. బాబుల్ కుమారుడు, స్థానిక ప్రధాన సెంటర్లో టీస్టాల్ నిర్వాహకుడు మున్వర్(46) ఇటీవల గుండెపోటుతో మరణించారు. మున్వర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు వద్ద ఉన్న వారి గృహానికి వెళ్లి బాబుల్‌ను, మున్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి ద్వారకనాథ్, మత్తి రాంబాబు, వెనిగళ్ళ తారక జగదీష్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అర్షద్, యడ్ల జగదీష్, జి.దుర్గారావు పాల్గొన్నారు.

రజకుల రామాలయంలో ఆషాఢ సారె వేడుక



ఘంటసాల: ఆషాఢ మాసం సందర్భంగా ఘంటసాల రజకుల రామాలయంలో ఆషాఢ సారె కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలోని సీతారాముల విగ్రహ దాతలు పోతార్లంక శ్రీనివాసరావు – రజని దంపతులతో సీతారాములకు అర్చకులు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహిళలంతా కలసి పసుపు, కుంకుమ, పండ్లు, నూతన వస్త్రాలతో పాటు వివిధ రకాల స్వీట్లు, చలిమిడిని తీసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మ వారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు ఆదిరాల భవాని, పోతార్లంక వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, బొమ్మిడి బంటి, పోతార్లంక రాజేశ్వరి పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమికులు



పెడన: కులాంతర వివాహం చేసుకున్న ఒక ప్రేమ జంట రక్షణ కోసం పెడన పోలీసులను ఆశ్రయించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు పెడన ఒకటో వార్డుకు చెందిన షేక్ బాజీ(24) ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇక్కుర్తికి చెందిన బత్తుల అక్ష(21)కూడా ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తుండేవారు. వీరిద్దరూ కొంతకాలం ప్రేమించుకుని శనివారం పట్టణంలో ఉన్న దర్గా వద్ద వివాహం చేసుకుని రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరుపక్షాల తల్లిదండ్రులను పిలిచి వారితో మాట్లాడి నచ్చజెప్పి పంపించారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టండి



పెడన: పెడన నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లోని రైతులకు సాగునీరు అందేలా పటిష్ట చర్యలు చేపట్టాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పెడన టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన ఇరిగేషన్ అధికారులతో పాటు నీటి సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సాగునీటిపై సమీక్షించారు. బల్లిపర్రు లాకు నుంచి నీటిని విడుదల చేశామని, ఇప్పటికే చాలా మంది రైతులు వెద జల్లి పంటను నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. గుడ్లవల్లేరు లాకుల ద్వారా వచ్చే పంట నీరును సక్రమంగా అందించాలని, దిగువ ప్రాంతమైన కృత్తివెన్ను మండలానికి పూర్తిస్థాయిలో నీరు అందించి రైతులను ఆదుకోవాలని, మల్లేశ్వరం వంతెన దగ్గర 5 అడుగుల నీరు వచ్చేలా మెయింటైన్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీ చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, ఇరిగేషన్ ఈఈ, డీఈ, ఏఈలు, టీడీపీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న నారుమడులు

సాగునీరు వృథాగా మురుగు డ్రైన్లోకి...

- సైఫర్ వద్ద పెద్ద గండి... జీటలు వారిన వంతెన సప్తా
- సుమారు 1,700 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

కోసూరువారిపాలెం(మోపిదేవి): కాలువకు సాగునీరు రాక విత్తనాలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని కోసూరువారిపాలెం, ఉత్తర చిరువోలులంక, మేళ్లర్తిలంక గ్రామాల్లో 12 వ నంబర్ కాలువ కింద సుమారు 1,700 ఎకరాలు సాగులో ఉంది. కేఈబీ కెనాల్ నుంచి అన్ని కాలువలకు 10 రోజుల క్రితం సాగునీరు విడుదల చేశారు. కాని 12వ నంబర్ కాలువకు సాగునీరు రావడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ పక్క మబ్బుల చాటున వరుణుడు దోబూచులాడుతుండగా కిందకు చుక్క రాలక పోవడంతో ఆకుమడులు పోసిన రైతులు బోర్లపై ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. కాలువకు నీరు లేకపోవడంతో భూ జలశాతం తగ్గి బోర్లు కూడా సరిగా పనిచేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. 12వ నంబర్ కాలువలో భూషయ్య బిల్డింగ్ సమీపంలో మురుగు డ్రైన్‌పై పూర్వం సైఫన్ ఏర్పాటు చేశారు. సైఫన్ సరిగా పనిచేయడం లేదని ఇటీవల దాన్ని పూడ్చించి పైన సప్తావేసి వంతెన ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ సప్తా కింద నుంచి పెద్ద కన్నాలు(గుంతలు) ఏర్పడి కాలువకు రావాల్సిన సాగునీరు నేరుగా మురుగు డ్రైన్‌లోకి పోతోందని, కాలువ కింద పోసిన ఆకుమడులు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. ఈ గుంతలు వెంటనే పూడ్చించకపోతే సైఫన్‌కు ఇరువైపులా సప్తా త్వరగా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇదే విషయాన్ని అనేకసార్లు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రస్తుతం కాలువ కింద మేళ్లమర్తిలంక, ఉత్తర చిరువోలులంక గ్రామాలకు చెందిన భూములకు చుక్క నీరు రావడం లేదని, కాలువ ఎండిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఆకుమడుల పరిస్థితే ఇలా ఉంటే నాట్లు వేసిన తరువాత తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైఫన్ వద్ద సాగునీరు డ్రైన్‌లోకి పోకుండా త్వరిత గతిన తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం ఇరిగేషన్ ఏఈ రవితేజ దృష్టికి తీసుకెళ్లగా గతంలో అంచనాలు వేసి పంపగా నిధులు మంజూరు కాలేదని, రెండు, మూడు రోజుల్లో తాత్కాలికంగా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మురుగు డ్రైన్‌లోకి పోతున్న సాగునీరు



ఎండిపోతున్న నారుమడికి పోసిన వరి విత్తనాలు

కాలువకు చుక్క నీరు రావడం లేదు



సైఫన్ వద్ద సప్తా బీటలు వారి కాలువ నీరంతా మురుగు డ్రైన్‌లోకి పోతోంది. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. భూ జల శాతం కూడా తగ్గిపోయింది. ఆకుమడులు పోసిన రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.

–కోసూరు వెంకటేశ్వరరావు, కోసూరువారిపాలెం

సాగు ఆలస్యం కాకుండా చూడండి



కాలువ చివరి భూములకు సాగునీరు రావడం లేదు. సైఫన్ బాగు చేయకపోతే చుక్క నీరు కూడా రాదు. అధికారులు స్పందించి కాలువకు సాగునీరు త్వరగా అందించాలి. అసలే మెట్టప్రాంతం కావడంతో భూములు నెర్రలిస్తున్నాయి.

–కోసూరు మల్లేశ్వరమ్మ, కోసూరువారిపాలెం

అట్టహాసంగా ఆషాఢ సారె సంబరం



నాగాయలంకలో ఆషాఢ సారె ఊరేగింపుతో తరలివస్తున్న ఆర్యవైశ్య మహిళలు

- 20 మంది వేదపండితులతో లక్ష మల్లెలతో అర్చన
- ప్రసన్న గణపతి గుడి నుంచి అమ్మవార్ల సారె ఊరేగింపు

నాగాయలంక: ఆషాఢమాసం పర్వదినాలు పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆషాఢ సారె సంబరం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో శ్రీనగరేశ్వరస్వామి, కన్యకాంబ, పార్వతీదేవి మూల విరాట్‌లను ఆధ్యాత్మిక శోభతో అలంకరించారు. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు, ముదునూరి అచ్యుతశేఖరశర్మ బ్రహ్మత్వంలో ప్రధాన పీఠం వద్ద ఆర్యవైశ్య సంప్రదాయ రీతిలో చిట్టా శివనాగేశ్వరరావు-రాజేశ్వరి దంపతులతో ఆషాఢ పూజ జరిపారు. ఈ సందర్భంగా తొలుత 20మంది వేద పండితులతో అమ్మవార్లు ఇరువురికి లక్ష మల్లెలతో విశేషార్చన నిర్వహించారు. తొలుత గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానం నుంచి సారె పళ్లాలతో ఆర్యవైశ్య మహిళలు, భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, మిఠాయిలను నగరేశ్వరుని ఆలయంలో అమ్మవార్లకు సమర్పించారు. అన్నపూర్ణయ్య, దేసు సత్యనారాయణ, తాడికొండ సత్యనారాయణ, చిట్టా వెంకట శేఖర్, వంకాయల ఆదిరాజేష్, వాసవీ సేవాదళ్ యూత్ సభ్యులు, ఆర్యవైశ్యసంఘం నాయకులు, సంకర్షణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లి అభివృద్ధికి రూ.లక్ష విరాళం

మొత్తం రూ.26 లక్షలు విరాళంగా ఇచ్చిన దాసరి

చల్లపల్లి: విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు దాసరి రామమోహనరావు స్వచ్ఛ సుందర చల్లపల్లి అభివృద్ధి కోసం శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ప్రతి సంవత్సరం తన పుట్టిన రోజున విరాళాన్ని అందించే రామమోహనరావు ఈ సారి కూడా రూ.లక్ష విరాళాన్ని స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులకు అందజేశారు. దీంతో ఇప్పటి వరకూ రామమోహనరావు మొత్తం రూ.26 లక్షలు విరాళంగా అందించినట్లు మనకోసం మనం ట్రస్టు సభ్యులు తెలిపారు.



డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ దంపతులకు రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న రిటైర్డ్ పీఈటీ దాసరి రామమోహనరావు

బాబు మాస్టారి సేవలు ప్రశంసనీయం

నాగాయలంక: ఉపాధ్యాయవృత్తిలో గత నలభై ఏళ్లుగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా, యూటీఎఫ్ నేతగా విశేష సేవలందించి ఇటీవల మండలంలోని సంగమేశ్వరం పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌బీబీవీ ప్రసాద్(బాబు మాస్టారు)అభినందన సభ శనివారం ఘనంగా జరిగింది. యూటీఎఫ్ మండల శాఖ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నాగాయలంక టీటీడీ కల్యాణ మండపంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బండ్రెడ్డి గోవర్ధన గోపాలకృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అంబటి శ్రీహరిప్రసాద్ (హరిబాబు), యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బాబు మాస్టారు ఉపాధ్యాయునిగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షౌకత్ హుస్సేన్, బి.కనకారావు, జె.లెనిన్‌బాబు, ఎంఈఓలు రామదాసు, అన్నపరెడ్డి రామారావు, స్థానిక యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనుబాబు, బి.సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద్ దంపతులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



బాబు మాస్టారు దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ జిల్లా, మండల శాఖల నేతలు

సాగునీరివ్వకుంటే రైతుల తరఫున పోరాటం

- మండలంలో విస్తృతంగా పర్యటించిన పేర్ని కిట్టు
- రైతులతో కలిసి ఎండిపోయిన పొలాల పరిశీలన
- కూటమి పాలన తమకు శాపంగా మారిందంటూ రైతుల ఆవేదన

కోనేరుసెంటర్: రైతులకు సకాలంలో సాగునీరు అందించకుంటే రైతుల తరఫున పోరాటం చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హెచ్చరించారు. బందరు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను పరిశీలించారు. రైతులను కలిసి మాట్లాడారు. సాగునీరు అందకపోవటంతో వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. తొలుత మండలంలోని తాళ్ళపాలెం గ్రామానికి చేరుకున్న కిట్టు అక్కడి రైతులతో కలిసి రామరాజు పంట కాలువను పరిశీలించారు. కాలువలో చుక్క నీరు లేకపోవటాన్ని చూసిన ఆయన రైతుల దీనస్థితిని అర్థం చేసుకున్నారు. రైతులు ఎండిపోయిన పొలాల్లోకి కిట్టును తీసుకువెళ్లి తమ పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించారు. తమకు సాగునీరు అందేలా చూడాలని ప్రాధేయపడ్డారు. స్పందించిన కిట్టు అధైర్యపడొద్దు.. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం కానూరు, బుద్దాలపాలెం, కొత్తపూడి, పొట్లపోతుపాలెం గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. బీడువారిన పొలాలను చూసిన ఆయన రైతులకు ధైర్యం చెప్పారు. రైతుల పక్షాన ప్రభుత్వంతో పోరాడైనా సరే సాగునీరు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కానూరుకు చెందిన రైతులు పలువురు కిట్టుతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు రెండు పంటలకు అవసరమైన సాగునీరు పుష్కలంగా అందిందని, కూటమి ప్రభుత్వంలో మొదటి పంటకే సాగునీరు అందించని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెద సాగు పద్ధతిలో వేసిన విత్తనాలు నీరు లేక ఎండిపోయినట్లు చెప్పారు. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షానికి పిలకలు మొలకెత్తినా మళ్లీ ఎండలు మండిపోవటంతో మొలిచిన మడులు కూడా ఎండిపోయాయని వాపోయారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కిట్టు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులకు కరువు రావటం అనేది సహజంగా మారిపోయిందన్నారు. పోనీ కరువులో ఉన్న రైతులను ఏదైనా ఆదుకుంటాడా అంటే అది అసలు జరగని పని అన్నారు. రైతులను ఆదుకోలేని ప్రభుత్వం ప్రజలకు అవసరమా అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 14 మాసాల్లో ఏ ఒక్క రైతు బాగున్న పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహారదీక్షకు దిగేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కిట్టు వెంట పార్టీ నాయకులు పిప్పళ్ళ నాగబాబు, వన్నెంరెడ్డి రామకృష్ణ, గణేశన రమేష్, గడిదేశి రాజు, బాలజేసు, గోపు మురళి, గాజుల నాగరాజు, చెక్కా ఏడుకొండలు, మూర్తిరెడ్డి, దండే బాబురావు, వేములకొండ, నట్టే ప్రసాద్, పెద్ద ఎత్తున ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



బందరు మండలం కానూరు గ్రామంలో రైతులతో కలసి పొలాలను పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దారుణం

కృత్తివెన్ను: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు చేసిన దాడి అత్యంత దారుణమని కృత్తివెన్ను మండల జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ మహిళా కన్వీనర్ జన్యావుల ఝాన్సీ తీవ్రంగా ఖండించారు. గుడివాడలో జరిగే పార్టీ సమావేశానికి వెళ్తున్న చైర్‌పర్సన్ కారును అడ్డగించి గంటన్నరపాటు నిర్బంధించడమే కాకుండా కారు అద్దాలు పగులగొట్టి వ్యక్తిగత దూషణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక బీసీ మహిళా చైర్‌పర్సన్‌కే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు ఈ ప్రభుత్వం ఇంకేం రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉన్న ఈ రాష్ట్రంలో ఉన్నత పదవిలో ఉన్న మహిళపై జరిగిన దాడిపై తగిన చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూర్ణసాగర్

అవనిగడ్డ: జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడిచేయడం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోవారి పూర్ణసాగర్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలు, బీసీ మహిళ అయిన హారికపై ఈ విధంగా టీడీపీ మూకలు దాడి చేయడం దారుణమన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలికే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ సమావేశానికి వెళుతున్న జెడ్పీ చైర్‌పర్సన్‌పై గుడివాడ ఎమ్మెల్యే అనుచరులే దాడికి పాల్పడ్డారని, ఈ దాడికి కారకులైనవారు, దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పేర్ని కుటుంబాన్ని విమర్శించే స్థాయి టీడీపీ నేతలకు లేదు

కోనేరుసెంటర్: టీడీపీలోని చోటామోటా నాయకులు పేర్ని కుటుంబం గురించి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, తమ నాయకుడి కుటుంబం పట్ల అవాకులు చవాకులు పేలితే రాబోయే రోజుల్లో దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుధాకర్ (సుబ్బన్న) హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పేర్ని కృష్ణమూర్తి మంత్రిగా బందరు నియోజకవర్గానికి అత్యుత్తమ సేవలను అందించారన్నారు. ఆయన తనయుడు పేర్ని నాని బందరు అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఇప్పుడు వారి వారసుడు పేర్ని కిట్టు ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వస్తే లేనిపోని నిందలు వేస్తుండటం సిగ్గు చేటన్నారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మీకు ధైర్యం ఉంటే కిట్టుపై చేస్తున్న ఆరోపణలను నిరూపించి చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకుడు చిటికిన నాగేశ్వరరావు మునిసిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు మీర్ అజ్గర్అలీ, ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ పల్లి శేఖర్, నగర ఉపాధ్యక్షులు గూడవల్లి నాగరాజు, కొలుసు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని నివాసం వద్ద హైటెన్షన్

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని రామానాయుడుపేట సెంటరులో ఉన్న పేర్ని నాని నివాసం వద్ద శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గుడివాడలో జరిగే వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు వెళుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని), మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌లను పేర్ని నాని నివాసంలో గృహనిర్బంధం చేసి, గుడివాడ వెళ్లకుండా నిలుపుదల చేశారు. దీంతో నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పేర్ని నాని నివాసానికి తరలివచ్చారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన కనిపించింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పరిస్థితిపై చర్చించారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పేరుకుపోయిన నిర్లక్ష్యం

- గుప్తా సెంటర్లో హై టెన్షన్ విద్యుత్ వైర్లకు పెనవేసుకుపోయిన తీగ చెట్లు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 19వ డివిజన్ పరిధిలోని మల్కాపట్నం గుప్తా సెంటర్లో హైటెన్షన్ విద్యుత్ తీగలకు తీగ మొక్కలు దట్టంగా పెరిగి అల్లుకు పోయాయి. గత కొద్ది నెలలుగా ఇవి ఇలానే ఉన్నా విద్యుత్ శాఖ సిబ్బంది వీటిని తొలగించకపోవడంతో ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ మొక్కల ద్వారా విద్యుత్ సరఫరా జరిగితే షాక్‌కు గురై ప్రమాదాలు జరిగే ఆస్కారముందని ఆందోళన చెందుతున్నారు. ఆ సెంటర్లోని భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం పక్కనే ఈ దృశ్యం కనిపిస్తోంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు పెనవేసుకుపోయిన తీగ మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



హై టెన్షన్ వైర్లకు అల్లుకుపోయిన తీగ మొక్కలు

అధ్వానంగా పారిశుద్ధ్యం

- పందులు, దోమల స్వైర విహారం
- ఇబ్బందులు పడుతున్న 12వ డివిజన్ ప్రజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 12వ డివిజన్ పరిధిలోని నోబుల్ కాలనీ, భాస్కరపురం ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డివిజన్లో పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నా తొలగించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ చెత్తకుప్పల వద్దకు ఆవులు, పందులు పెద్ద ఎత్తున తరలివచ్చి చిందర వందర చేస్తూ అపరిశుభ్ర పరిస్థితులను నెలకొల్పుతున్నాయి. రాత్రి అయితే దోమల స్వైర విహారంతో డివిజన్ ప్రజలు కంటి మీద కునుకు లేక నిద్రకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.



12వ డివిజన్‌లోని ప్రధాన రహదారి వెంబడి చెత్త కుప్పను చిందరవందర చేస్తున్న ఆవులు, పందులు

ప్రకటన

[illegible]

యం.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు
అడ్వకేట్ & నోటరీ, మచిలీపట్నం
మచిలీపట్నం
తేది:12-07-2025

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి నీచమైన చర్య

- రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిదర్శనం
- ముక్తకంఠంతో ఖండించిన నేతలు

పెడన:గుడివాడలో వైఎస్సార్ సీపీ సమావేశానికి హాజరయ్యేందుకు వెళుతున్న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నాయకులు చేసిన దాడి నీచాతినీచమైన, అత్యంత హేయమైన చర్య అని పలువురు ఖండించారు. పోలీసుల సమక్షంలోనే ఏమాత్రం భీతి లేకుండా అధికారం తమదేనని, తమను ఎవరూ అడ్డుకోలేరన్న కండకావరంతో చేసిన ఈ దాడి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిదర్శనమన్నారు. ఎవరేమన్నారంటే....

ప్రథమ పౌరురాలికే రక్షణ లేకపోతే...



ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకే రక్షణ కల్పించలేని పోలీసులు ఇక సామాన్యులకు ఏం రక్షణ కల్పిస్తారు. టీడీపీ, జనసేన రౌడీమూకలు పోలీసుల ఎదుటే దాడులకు పాల్పడటం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని ఆ పార్టీలు ఎలా అపహాస్యం చేస్తున్నాయో అర్థం అవుతోంది. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామం ఉందా అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి.

– కటకం నాగకుమారి, ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

బీసీ మహిళపై దాడి.. పిరికిపంద చర్య



జెడ్పీ చైర్ పర్సన్, బీసీ మహిళ ఉప్పాల హారికపై దాడి పిరికిపంద చర్య.. టీడీపీ, జనసేన గూండాల దూషణ పర్వం, దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునే సంఘటన. దాడులకు పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలి.

– సమ్మెట బాబు, కాపు నాయకుడు, పెడన


రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



మహిళ అని కూడా చూడకుండా దూషించి, దాడి చేయడం నీచమైన చర్య. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న గౌరవం పోతోంది.

– యద్లపల్లి రామ్‌సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకుడు, పెడన

రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిదర్శనం



ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, బీసీ మహిళ అయిన ఉప్పాల హారిక ఉమ్మడి జిల్లా ప్రథమ పౌరురాలని, అటువంటి ఆమెకే పోలీసులు రక్షణ కల్పించకపోగా ప్రేక్షక పాత్ర పోషించడం రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిలువెత్తు నిదర్శనం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా, పోలీస్ వ్యవస్థ దిగజారిపోకుండా నడుచుకోవాలి.

– పిన్నింటి మహేష్, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్